# నిరపేక్ష

'రామనామ తారకం - భక్తి ముక్తి దాయకం' అనే పదజాలం స్ఫురణకు వచ్చింది గోవిందరావుకు ఆ రోజు నిద్రలేవడంతోటే, పొద్దున్నే ఈ మాటలు గుర్తుకు రావడంలో ఏదైనా ప్రత్యేక అర్థం ఉన్నదా అని అతని మనసు కొంతసేపు ఆలోచించింది.

పడుకోవటానికి ముందు గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కంలో కొన్ని దృశ్యాలు చదివాడు. ఆ చదవడం అయినా ఏదో కాలక్షేపం కోసం, నిద్ర రావడం కోసం కాదు. మరునాడు 'బైరాగి వేదాంతం' గురించి ప్రసంగం ఇవ్వవలసి ఉంది రేడియోలో. పూజారి గవరయ్య దయ్యాలను సీసాలలో బిగించడం, డబ్బు సరిగ్గా ఇవ్వని వాళ్ళను ఈ మూతలు తెరిచి దయ్యాలను వదిలిపెడతానని బెదిరించడం - మొత్తం మీద అన్నీ నవ్వు పుట్టించే సన్నివేశాలు. మళ్లీ మళ్లీ చదువుతున్నాడు నిద్రపోయే ముందు.

తీరా చూస్తే ఈ మాటలు బైరాగికి గాని, పూజారి గవరయ్యకు గాని ఏమీ సంబంధించినవి కావు. లుబ్ధావధాన్లు అంటాడు - రెండో పెళ్లి ముండనే పెళ్లి చేసుకున్నానని నిర్ధారణ అయినాక, వీళ్లందరూ కలిసి తనను దోచుకు తింటున్నారని ఖరాకండీ చేసుకున్నాక ! ఈ గండం గడిచి బయటపడితే ఏ కాశీయో వెళ్లి కాలక్షేపం చేస్తాను అనుకుని, ఇదంతా సజావుగా నడిచిపోవటానికి 'రామనామ తారకం - భక్తి ముక్తి దాయకం' అంటూ ఈ స్తోత్రం పూర్తిగా చదువుకుంటాడు. ఏమైనా ప్రాణం మీదికి వచ్చినప్పుడే భగవత్స్మరణ. అంతకుముందు 'ఇహ' సుఖాల కోసం పాకులాడుతున్నప్పుడు ఆయన గుర్తుకు ఎలారాడు అన్న విషయాన్ని అప్పారావుగారు సూచనగా చెప్పారు. ఇదే లోక రీతి. ఎంత చదువుకున్నవాళ్లు, శ్రోత్రియులు అయినా సరే - అని గోవిందరావు సమాధానం చెప్పుకున్నాడు.

కాఫీ తాగి న్యూస్ పేపర్ చేత పట్టుకున్న తరువాత ఇవాళ కార్యక్రమాలు ఏమిటో చూసుకుంటే మంచి దనిపించింది.

'ఎంగేజ్‌మెంట్ పాడ్' పరికించాడు.

మధ్యాహ్నం 'శీతారాం' భోజనానికి పిలిచాడు. పన్నెండు గంటలలోపు అతని ఇంటికి వెడితే చాలు. భోజనం చేసి కబుర్లు చెప్పుకుంటూ కాస్తంత విశ్రాంతిగా కూర్చుంటే ఎలాగూ ఒకటిన్నర, రెండూ అవుతుంది.

రెండున్నరకు రేడియో స్టేషన్‌కు వెళ్లవలసిన పని ఉంది.

ప్రోగ్రామ్ ఆఫీసర్‌తో పైనెలలో తాను చేయవలసిన నాటకాన్ని గురించి చర్చించాలి. ఈ రికార్డింగ్ అయిపోయిన మీదట. దేశాభివృద్ధి ప్రణాళికలు, హాస్యం, సమకాలీన సామాజిక సమస్యలు - ఇవన్నీ గుదిగుచ్చి వినేవాళ్లకు 'బోర్' అనిపించకుండా, వాళ్ల ఆలోచనలకు పదును పెట్టగల నాటకం స్క్రిప్టు తయారుచేయాలి. కొన్ని సీన్సు, కొన్ని పాత్రలు తన మనస్సులో ఉన్నాయి. అవి రేడియోవారికి కూడా అంగీకారం అయితే నాటకం రాయడం మీద కూర్చోవచ్చు. ఈ రోజు సాయంత్రం ఆ పని చేసుకోవాలి.

శీతారాం ఇంటికి రేడియో స్టేషన్ దగ్గరే. పది నిముషాలలో చేరుకోవచ్చు కాలి నడకన అయినా.

అక్కడ పని అయిపోయిన తర్వాత తిన్నగా ఇంటికి వచ్చేస్తే అప్పటికి ఈ రోజు రావలసిన టపా అంతా వచ్చేసి ఉంటుంది గనుక, తీరికగా చూసుకుంటూ కూర్చోవచ్చు.

స్థూలంగా ఈ రోజుకు ఇదీ పని - అనుకున్న తర్వాత గోవిందరావుకు మనసు నెమ్మది అయింది.

న్యూస్ పేపర్లు శీర్షికలు మాత్రం చూడడంతో అతనికి ఎన్నడూ తృప్తి లేదు. తీరుబడిగా సంపాదకీయం, మధ్యపేజీల్లో, ఉన్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యాసాలు వ్యాఖ్యానాలు విధిగా చదువుతాడు.

పేపరులో వార్తలు కల్లోలం కలిగిస్తున్నాయి మనసుకు.

ఎక్కడా శాంతి, సామరస్యం, సుఖజీవనం కనిపించదు. అభిప్రాయాల కోసం బాధలు భరించేవాళ్లు లేకపోగా, తమ అభిప్రాయాలు, ఆలోచనలు నెరవేరడం కోసం ఇతరుల ప్రాణాలు అయినా తీయడానికి, మరింకే ఆలోచనా లేకుండా ముందుకు దూకగల వాళ్ళే కనిపిస్తున్నారు ఎక్కడాను. ఎవడికి వాడికి తన ప్రత్యేకత తప్ప ప్రపంచం ఏమైపోతోంది, జనం ఎటువైపు ప్రయాణం చేస్తున్నారు అన్న దృష్టే లేకుండా పోతోంది.

ఆ రోజు పత్రికలో ఒక చిన్న వార్త అతన్ని ఆకర్షించింది.

పిల్లలు లేరని, తగినంత కట్నం తీసుకురాలేదని ఆడవాళ్ల మీద అత్యాచారాలు జరుగుతున్న వార్తలు మామూలు అయిపోయినాయి. వీటికి భిన్నమైన వార్త ఇది.

భర్త తనను ఎంతో ఆప్యాయంగా చూస్తున్నాడు. ఏం కావాలంటే అదల్లా సమకూరుస్తున్నాడు. కాని తను ఎంత తప్పు చేసినా, నిర్లక్ష్యం ప్రదర్శించినా, అవమానకరంగా మాట్లాడినా తనను మందలించడం లేదు. వంటిమీద వాతలు పడేటట్లుగా కొట్టకపోతే మానె, మనస్సు కుమిలిపోయేట్లు మాటలయినా అనడం లేదు. 'నాకు ఈ జీవితం, ఇంత సుఖవంతం, ప్రశాంతం అయిన జీవితం ఏ మాత్రం రుచించడం లేదు. అందుచేత ఈ పద్ధతిని రోజులు గడవటం ఇష్టం లేక – ఇంతకంటే మరో మార్గం లేక – నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. ఈ ఆత్మహత్యకు నేనే తప్ప ఇతరులెవరూ కారణం కాదు' అని ఈ విషయంతో జోక్యం ఉన్నదనుకున్న వారందరికీ ఓ బహిరంగ లేఖ రాసి ఒక ఇల్లాలు ఈ ప్రపంచం నుంచి అదృశ్యం అయిపోయింది. చదువుకోని మూర్ఖురాలు కాదు. బి. ఏ. అయి ఒక ప్రైవేటు కంపెనీలో సేల్స్ డివిజన్‌లో ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా ఉంది ఆ పడుచు.! భర్త గవర్నమెంట్‌లో అధికారి.

గోవిందరావుకు ఈ మానసిక వికారం అర్థం కాలేదు.

అమెరికాలోనో, ఇతర యూరపు దేశాలలోనో అయితే ఇటువంటి సంఘటనలు అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలో కూడా 'ఐశ్వర్య మదాంధత – ఏమీ పని లేక కొట్టుకోవడం' వల్ల వచ్చే మానసిక వికారాలు, ఆర్భాటాలతో కూడిన అనవసర కార్యకలాపాలు పెరిగిపోయే సూచనలు విస్తారంగా కనిపిస్తున్నాయి.

కిటికీలో నుంచి బయటకు చూస్తే ఎండ బాగా తీక్ష్ణంగా ఉన్నట్లు అనిపిస్తోంది. సెప్టెంబర్ నెల, నిజానికి ఇప్పుడు వేసవిలోలా మండిపోవలసిన అవసరం లేదు – సూర్యుడికీ, వాతావరణానికీని. కాని ఋతువులు తమ తమ క్రమాలను ఎప్పుడో తప్పిపోయినట్లు అనిపిస్తోంది – దేశంలో అనావృష్టి, అతివృష్టి సందర్భాలు పరికిస్తే, హిందూ మహాసముద్రంలో అణ్వస్త్రాల ప్రయోగాలు, తత్ఫలితంగా వాతావరణ కాలుష్యం ఇందుకు కారణాలుగా పత్రికలలో వ్యాసాలు పరంపరగా వస్తున్నాయి.

గోవిందరావు ఇలా ఆలోచించుకుంటూ ఉండగానే సమయం పదిన్నర అయి

పోయింది.

శీతారాం ఇంటికి వెళ్లడానికి అరగంట పడుతుంది - ట్రాఫిక్ జామ్ వల్ల మధ్యలో ఆటంకం కలగకపోతే. అందుచేత పదకొండు గంటలకు బయలుదేరినా చాలు. ఈ లోపల దుస్తులు మార్చుకుని తయారు అవడం ఒక పని ఉంది.

శీతారాంతో ఇరవయి సంవత్సరాల నుంచి పరిచయం. అయినా అతని ఇంటికి వెళ్లిన సందర్భాలు మటుకు తక్కువ. ఆ ప్రాంతంలో మరేదో పని పడి తిరుగుతున్నప్పుడు అతనే రోడ్డు మీద కలిసి రెండు మూడు సార్లు తమ ఇంటికి తీసుకు పోయాడు.

శీతారం తరచుగా - అంటే నెలకు ఒక్కమారయినా కనిపిస్తూ ఉంటాడు. ఉద్యోగ రీత్యా దేశం అంతా తిరుగుతూ ఉంటాడు. నెలలో ఇర్వై రోజులపాటు 'టూర్'లోనే ఉంటానని చెప్పాడు. ఎప్పుడైనా సెలవు తీసుకున్నప్పుడు మాత్రం, ప్రపంచం ముఖం చూడకుండా, ఇతరుల ప్రసక్తి పెట్టుకోకుండా ఇంట్లోనే తలుపులు బిగించుకుని కుటుంబంతో గడిపేస్తానన్నాడు. సంవత్సరంలో ఓ పది, పదిహేను రోజులు మాత్రం ఇలా చేయగలుగుతాడట! కనిపించిన ప్రతిసారీ "నువ్వెప్పుడూ మా ఇంటికే రావు!" అని నిష్ఠూరం వేస్తాడు. "నీవు ఊళ్లోనే ఉండవు గదా!" అని జవాబు చెబుతాడు గోవిందరావు.

" ఉన్నప్పుడు రావచ్చుగా. నీకేం టైం లేదు గనుకనా ? నీకు నీవే రాజువు!॥

"చూద్దాంలే, నువ్వు ఫ్రీగా ఉన్నప్పుడు చెప్పు. పై నెలలో ఎప్పుడైనా వస్తాను" అంటాడు గోవిందరావు.

ఇది అలవాటు అయిపోయిన సంభాషణ. ఒక ఆఫీసుకు వెళ్లాలని, తప్పనిసరిగా ఈ పని చేయాలని కాలం వెనుక పరుగులు తీయాలనీ లేకపోవడం వల్ల గోవిందరావుకు ఎప్పుడూ విశ్రాంతి, తీరుబాటు కిందే లెక్క. అయినా 'ఎంగేజ్‌మెంట్ పాడ్' శ్రద్ధగా రాసుకుని ఆచరిస్తాడు.

సమయమంతా పుస్తకాలు చదువుకోవడం, రాసుకోవడంతో గడిపి వేస్తాడు. సభలన్నా, సమావేశాలన్నా 'ఎలర్జీ' అతనికి. ఊకదంపుడు ఉపన్యాసాలు వినడానికి చెవులు అప్పగించాలంటే మనసు పోదు. అంతకంటె 'క్రాస్‌వర్డ్ పజిల్స్' పూర్తి

చేసుకుంటూ ఇంట్లో కూర్చుంటే మనసుకు పదును.

గోవిందరావు శీతారాం ఇంటిముందు స్కూటర్ ఆపుచేసేసరికి సరిగ్గా పదకొండున్నర అయింది.

ఇంటిముందు బ్రౌన్ బోర్డ్ - 'బి. శీతారాం, ఎం. ఎస్. సి.' - రెండో లైన్లో కంపెనీ పేరు, ఆ కింద 'ఇన్/ఔట్ మొబైల్ బ్లాక్' ఉంది.

గోవిందరావుకు దాన్ని చూడడంతోటే నవ్వు వచ్చింది.

ఇలాంటి బోర్డులు చాలా ఇళ్ల ముందు ఉంటాయి. కాని దీన్లో అనవసరమైన మాట ఉన్నట్టు ఎవరికీ పట్టినట్టు లేదు. ఈ బోర్డ్‌లో 'ఇన్' లేకపోతే నేం ? ఇంట్లో లేరు అని సూచించడానికి 'ఔట్' ఒక్కటే చాలదా ? అయినా ఇంత దూరం వచ్చిన మనిషి ఇంట్లో లేరని తెలిసినంత మాత్రాన వెళ్లిపోతాడా ? తన పేరు, ఊరు, వచ్చిన పని, మళ్లీ ఎప్పుడు వస్తే కలుసుకోవచ్చును - ఇలాంటి వివరాలు కనుక్కోకుండా వెళ్లగలడా ?

ఇంతకూ శీతారాం నేమ్ బోర్డులో ఇప్పుడు 'ఔట్' అని ఉంది !

తనను ఇంటికి రమ్మని ఎక్కడకు వెళ్లాడు ఇతను ?

గోవిందరావు తాపీగా స్కూటర్ నీడలో పార్క్‌చేసి, రెండు చిన్నమెట్లు ఎక్కి తలుపు సమీపించి నేమ్ బోర్డ్ పక్కనే ఉన్న కాలింగ్‌బెల్ బటన్ సున్నితంగా నొక్కాడు.

లోపల నుంచి 'బజ్' శబ్దం అతనికి వినిపించింది.

రెండోమారు నొక్కవలసిన అవసరం లేకుండానే తలుపు తెరుచుకుంది.

శీతారాం భార్య తెరచిన తలుపుల మధ్య నిలుచుని, గోవిందరావును చూస్తూనే ముఖంలో నవ్వు పులుముకుని, ''రండి!'' అంది.

''శీతారాం ఇంట్లో లేరా?'' అనడిగాడు గోవిందరావు - ఆమె ఆహ్వానాన్ని ఎలా తీసుకోవాలో తెలిక. ఎందుకంటే ఆమె గుమ్మంలోనే నిలబడిపోయి అతనికి లోపలకు వెళ్లటానికి దారి ఇవ్వడం మరిచిపోయినట్లుంది.

''ఓ అరగంట క్రితం బయటకు వెళ్లారండీ ! బహుశా ఇప్పుడో, ఇంకో పది నిముషాలలోనో తిరిగి వచ్చేయవచ్చు. రండి, కూర్చోండి!'' అంది ఆమె, ఈ మారు గుమ్మంలో నుంచి పైదొలిగి.

గోవిందరావు లోనికి అడుగు పెట్టాడు. అంత అకస్మాత్తుగా ఎందుకు వెళ్లిపోయా డబ్బా ! తీరా తాను వచ్చే సమయానికి ముందే ఉడాయించేశాడే అనుకుంటూనే ''ఆఫీసుకు గాని వెళ్లారా?'' అని అడిగాడు.

''లేదండీ ! ఈ వారం అంతా సెలవులలోనే ఉంటారు. కూర్చోండి!'' అంది ఆమె.

''నా పేరు గోవిందరావు. శీతారాం, నేను చాలా కాలం నుంచి స్నేహితులం'' అన్నాడు గోవిందరావు ఎందుకైనా మంచిదని.

ఆమె నవ్వుతూనే, ''నాకు తెలుసునండీ ! మిమ్మల్ని గురించి ఇంట్లో అనుకుంటూనే ఉంటాం. పత్రికలలో మీ రచనలు, ప్రశ్నలు, సమాధానాలు చూచినప్పుడల్లా వారు మీ గురించి గర్వంగా చెబుతూ ఉంటారు. మా పిల్లలకు మీ కథలంటే ఇష్టం'' అంది.

''అయితే మీకు ఇష్టం లేదన్నమాట!'' అనుకున్నాడు గోవిందరావు మనసులోనే సరదాగా, అయినా తమ విషయం ఎవరికి వారు ఎలా చెప్పుకుంటారు, అందులోనూ ఆడవారు ! 'మీ రచనలు మాకు ఇష్టం' అని చెప్పేవాళ్లయినా నిజంగా అవన్నీ చదివి, అందులో తాము ఇష్టపడటానికి వీలైన సంగతులే ఉన్నాయని గుర్తించారని అనుకోవటానికి వీలులేదు. ఏదో లాంఛన ప్రాయంగా, పలకరింపుగా, అంతకంటే ఇంకేమి అన్నా బావుండదని అలా అంటూ ఉంటారని కూడా గోవిందరావు అనుభవం.

డ్రాయింగ్ రూంలో కూర్చున్నాడు గోవిందరావు. ఎదురుగా ఉన్న న్యూస్ పేపర్ తాను ఆసాంతం చదివేసిందే ! దాని కింద ఉన్న నాలుగయిదు పత్రికలు కూడా పేజీలు తిప్పి పడవేసినవే. చూసినవే మళ్లీ మళ్లీ చూడాలంటే విసుగు. అయినా పరిచయస్థుడితో కులాసాగా కాలం గడపటానికి వచ్చాడు గాని తాను, ఏదో లైబ్రరీలలోలాగా పుస్తకాలు, పత్రికలు చదవటానికి కాదు గదా !

ప్రపంచ పోకడలపైన జనం ఎలా స్పందిస్తున్నారు; రాయడానికి వీల్లేని, అవకాశం లేని అభిప్రాయాలు వారి మనస్సులో ఎన్నెన్ని ఏమేమి ఉన్నాయి - తెలుసుకోవటానికి గోవిందరావుకు ఇటువంటి స్నేహితులతో కలుసుకుని కులాసాగా గడవడం ఒక

మార్గం. అందుకనే ప్రతి పరిచయాన్ని చక్కగా ఉపయోగించుకోవాలని చూస్తాడు.

శీతారాం భార్య ఆపిల్ జ్యూస్ నిండిన కప్పుతో ప్రత్యక్షం అయింది ఈ మారు.

''తీసుకోండి!''

''భోజనానికి ముందు అపటైజర్'' అనుకున్నాడు గోవిందరావు.

టైం చూడగా - పన్నెండున్నర అయింది అప్పుడే!

శీతారాం ఇంకా అయిపులేదు. ఎక్కడ చిక్కుపడిపోయాడో, ఏమో! అతని భార్య మరో నాలుగు పత్రికలు లోపల నుంచి తీసుకువచ్చి బల్లమీద ఉంచింది. ఇండస్ట్రీకి, మెడికల్‌సైన్స్‌కు సంబంధించిన పత్రికలు అవి. బహుశా శీతారాం ఉద్యోగ రీత్యా వాటిని పరికిస్తూ ఉండటం అవసరం. అందమైన అచ్చు, ఆకర్షకమైన ముద్రణ తప్ప గోవిందరావుకు వాటిలో తనను ఆకట్టుకునే విషయాలు అంతగా కనిపించలేదు. బొత్తిగా 'ప్రొఫెషనల్ జర్నల్స్!'

గోవిందరావుకు చిరాకు అనిపించింది. కాని ఏం చేసేటట్లు ? గభాలున లేచిపోయే సన్నివేశం కాదు; ఎంతసేపయినా కాచుకు కూర్చునే సందర్భమూ కాదు. కడుపులో ఎలుకలు పరుగులు తీస్తున్నాయి. కాస్త జఠరాగ్ని ప్రకోపించి ఇబ్బంది పెడుతున్న మాట వాస్తవమే.

అయిదు నిముషాలకు ఒకమారు శీతారాం భార్య ఏదో పని ఉన్నదన్నట్లుగా ఇటు వైపు ముఖం చూపించి మరీ వెడుతోంది. ఆమెతో మాటలు పెంచుకుందుకయినా ఎక్కువ చొరవ లేదు. ఆమె పుట్టిల్లు ఏ ఊరో, పిల్లలు ఎందరో, ఏ మేం చేస్తున్నారో అడిగితే బాగానే ఉంటుంది గాని, కాస్త కాలక్షేపం అయ్యే మాట నిజమేగాని, శీతారాం తన స్నేహితుడు అనుకుంటూ, ఈ మాత్రం అతని కుటుంబ భోగట్టా అయినా తెలియదనే విషయం తనంత తాను బయటపెట్టుకోవడం అవుతుంది.

టైమ్ ఒంటిగంటన్నర అవుతూ వస్తోంది. అంచనా ప్రకారం అయినట్లయితే ఈ పాటికి హాయిగా భోజనం చేసేసి, విశ్రాంతి కూడా అయిపోయి, తిరుగు ప్రయాణాన్ని గురించి ఆలోచించవలసిన విషయం.

శీతారాం ఇంతవరకు జాడ, జవాబు లేదు.

''ఆయన ఇంకా రాలేదండీ! ఎక్కడ తిరుగుతూ, ఎవరితో కబుర్లు పెట్టుకున్నారో!

మీరు చాలాసేపటి నుంచి ఒంటరిగా కాలక్షేపం చేస్తున్నారు. పాపం!'' అంది శీతారం భార్య. ఆమెకూ కాస్త మనసులో ఇబ్బందిగానే ఉన్నదన్నమాట.

శీతారాం రాకుండానే, ఆలస్యం అయిపోతోందనే నెపంతో ఒక్కడినీ భోజనానికి లేవమంటుందేమోనని భయపడ్డాడు గోవిందరావు – ఒక్క నిముషంపాటు. బాగా పరిచయం ఉన్న మనుషులయితే ఫరవాలేదు. కాని – ఇదే మొదటి మారు తాను ఇక్కడకు 'అమృతమస్తు' అనడానికి రావడం. తన పేరు, ఊరు ఆమెకు తెలిసి ఉండవచ్చును గాక, తీరి కూర్చుని ఆమెచేత వడ్డన చేయించుకుంటూ భోజనం చేయడం చాలా ఎబ్బెట్టు అయిన సందర్భం అనిపించింది.

పోనీ – వెళ్లిపోతేనో ! అనుకున్నాడు.

ఏం బాగుంటుంది అలా చేస్తే ?

స్నేహితుడు ఎంత బాధపడతాడు ! పాపం, ఏ పని ఉండి ఎక్కడ చిక్కుకు పోయాడో! తాను ఎలా మనసులో గందరగోళపడుతున్నాడో, అలానే శీతారాం కూడా, మరోచోట చిక్కుకుపోయి ఈ దురవస్థకు తపించిపోవడంలేదనీ, ఆ ఇరుకు సందర్భం త్వరగా బయటపడి చిరకాలస్నేహితుడిని 'భోజనం బల్ల' దగ్గర కలుసుకుని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయాలని ఉండదనీ ఎలా అనుకోవడం ?

రెండు గంటలు అవటానికి ఇంకా పన్నెండు నిముషాలే ఉంది. ఇప్పుడయినా బయలుదేరకపోతే సకాలానికి రేడియో స్టేషన్‌కు చేరుకోవడం కుదరదు.

చెప్పిన టైంకు మనుషుల్ని కలుసుకోకపోయినా, అనుకున్న ప్రకారం టైముకు ఠంచనుగా పనులు చేయకపోయినా గోవిందరావుకు ఒళ్లంతా తేళ్లు, జెర్రులు పాకుతున్నట్లు ఉంటుంది.

ఇక లాభం లేదు. బయలుదేరవలసిందే.

ఈమారు శీతారాం భార్య ముఖం హాలులో కనిపించినప్పుడు, ''అయితే నేను వెళ్లి వస్తానండీ ! వేరే పని ఉంది'' అన్నాడు నసుగుతూ.

''చాలాసేపు కూర్చున్నారు. ఆయన వచ్చేస్తూనే ఉంటారు. మరో అయిదు నిముషాలు చూడండి !'' అంది ఆమె.

• • •

పరాంకుశం ఆస్పత్రి నుంచి బయటపడ్డాడు.

చేతిలోని బ్రీఫ్‌కేస్ పాతబడిపోయి అక్కడక్కడా రంగు వెలిసిపోయి ఉంది. దాన్లో ఇమడని సరంజామా కోసం ఒక షోల్డర్ బ్యాగ్ కూడా తగిలించుకున్నాడు.

రోడ్డువారన నడుస్తున్నప్పుడు ఆలోచనలన్నీ ఏక ముఖంగా ఉన్నాయి. జీవితాన్ని తీర్చిదిద్దుకోవడమే తక్షణ కర్తవ్యం.

పేవ్‌మెంట్ చక్కగా నాలుగు పలకల రాళ్ళతో అమర్చినట్లు ఉంది. ఆ రాళ్లు కొన్ని ఎక్కువ వాడకం వల్లనో ఏమో మధ్యలో పగిలాయి. కొన్ని మూలలో బీటలు తేరాయి. పరాంకుశం బాగా పరిశీలించి మరీ నడుస్తున్నాడు. అతనికి తేలిన అంశం ఏమిటంటే, ప్రతి మూడు రాళ్లకూ ఒకటి ఇలా శిథిలావస్థలో ఉండి. ఎన్నో పేవ్‌మెంట్లు చూశాడు అతను. నాలుగు పలకల రాళ్లు అందంగా పరచి ఉంటాయి. నిజమే, కాని అందులో బద్దలయిపోకుండా ఉన్నవి మూడోవంతు మాత్రమే ! అంటే, అడుగు తీసి అడుగు వేస్తున్నప్పుడు చాలా జాగ్రత్తగా, నిదానంగా, ఎంచి చూసుకుంటూ మరీ వెళ్లాలన్నమాట! బీటలు వారిన రాతి పలకల మీద అడుగులు వేసి నడిస్తే ఇంకేమైనా ఉందా ? తన జీవితం కూడా అలాగే బీటలు వారిపోతుంది ! జీవితాన్ని భద్రంగా కాపాడుకోవాలంటే, దానిలో ఇమిడిపోవటానికి చూచే అవలయలను దూరంగా పారదోలాలనుకుంటే, ఇలా జాగ్రత్తగా నడవడం తప్ప ఇంకేం మార్గం లేదు.

'సుస్తీ' నయమయిపోయింది. నిజమే.

అయితే పాత వాసనలు, అలవాట్లు ఇంకా అలాగే ఉండిపోతాయి.

వాసనలు భద్రంగా ఉంచుకోవడం మంచిదా ? వాటిని దాటి పరుగులు తీసే ప్రయత్నం మంచిదా ? పరాంకుశం మళ్లీ ఆలోచనలో, పడిపోయాడు.

భద్రత కావాలి జీవితానికి.

నలగని బాట, బీటలు లేని బాట అవసరం. ఇబ్బందులు, అననుకూలతలు రాకూడదు. ఎవరో కవి చెప్పినట్లుగా జీవితం 'సరళరేఖ' లాగా నడిచిపోవాలి. నిజానికి అలాగే నడిచిపోయింది ఇన్నాళ్లూ. మధ్యలో ఏదో చికాకు వచ్చి ఆస్పత్రిపాలు కావలసి వచ్చింది. డాక్టరు ధర్మమా అని ఇప్పటికి బయటపడ్డాడు.

ఆస్పత్రి గుర్తుకు రావడంతోటే కడుపులో 'ఆకలి' దేవినట్లు అయింది. అక్కడ ఉంటే ఈ పాటికి నర్స్ రెండు బ్రెడ్ టోస్ట్, టీ, పాలు తీసుకువచ్చి, తాను తిని, తాగే

దాకా పక్కనే కనిపెట్టుకుని ఉండి మరీ వెళ్లేది. ఇప్పుడు ఈ రోడ్డు మీద తనకెవరూ ఆలనా, పాలనా లేరు. తిన్నావా, లేదా అని అడిగేవాళ్లు లేరు. తినకపోతే కోపం చేసి తినిపించే వాళ్లు అసలే లేరు.

తక్షణం అవసరం అయిన వాస్తువుల జాబితా తయారుచేసుకున్నాడు. మనసులోనే. ఒక మాదిరి దుకాణాలు - మధ్య తరగతివాళ్ళు [దేనికి మధ్య?] నివసించే ఇళ్లు ఉన్న ప్రాంతంలో అయితే మంచిది. నగరంలో ఎన్నో కొత్త 'ఎక్స్‌టెన్షన్లు' వస్తున్నాయి. అవయినా బాగుంటాయి. తనకు కావలసింది ఒక గది ! తినడానికి కూడా ఏమైనా కావాలి. తరువాత నింపాదిగా, ఏదైనా ఉద్యోగం చూసుకుని కుదుటపడాలి.

సుస్తీ పడటానికి ముందు ఓ 'పెద్ద పుస్తకాల తయారీ కంపెనీ'లో ప్రూఫ్ రీడర్‌గా ఉండేవాడు. మళ్లీ వాళ్లనే అడిగితే తన 'ఉద్యోగం' తనకు ఇచ్చేస్తారేమో కనుక్కోవాలి. ఉద్యోగం మానేసినప్పుడు వాళ్లతో చెప్పలేదు, చేయలేదు. నిజానికి 'రూల్' ప్రకారం అయితే మూడు నెలల నోటీసు ఇవ్వాలి. కాని, పరిస్థితి చెబితే వాళ్లు కరిగిపోతారేమో ప్రయత్నం చేయాలి. ఆ పుస్తకాల కంపెనీ చాలా పెద్దది. వాళ్లు ఇవ్వదలుచుకుంటే మళ్లీ ఉద్యోగం దొరకడం ఎంతమాత్రం కష్టం కాదు.

అప్పుడే అతన్ని ఎవరో భుజం పట్టి ఆపేశారు.

''ఎవరు?'' అన్నాడు పరాంకుశం అయోమయంగా చూస్తూ.

'అవునా, కాదా అని పరకాయించి చూస్తున్నాను, ఇందాకటి నుంచి, ఇప్పుడింక ఏ మాత్రం అనుమానం లేదు. నువ్వు తప్పకుండా పరాంకుశానివే. ఏమిటి ఈ అవతారం? ఎక్కడి నుంచి వస్తున్నావు ? ఎందాకా?'' అని అడిగాడు అతన్ని ఆపివేసిన మనిషి.

పరాంకుశం ఇంకా అతన్ని 'ప్లేస్' చేయలేక తికమకగా చూస్తున్నాడు. తనను తెలిసిన వాళ్లు చాలామంది ఉంటారు. కాని తనకు తెలిసినవాళ్లు బహు తక్కువ.

'నేనురా, గుర్తు దొరకలేదా ? శీతారాంను, బి. ఏ.లో మనం కలిసి చదువు కున్నాం- ప్రెసిడెన్సీ కాలేజీలో. నీ పరధ్యానం ఇంకా అలాగే ఉందన్నమాట!''

శీతారాం ... శీతారాం ...

పరాంకుశం ఒక్క నిముషం ఆలోచనలో పడ్డాడు.

గుర్తు వచ్చిందనటానికి వీల్లేదు. అయినా తనను ఎరుగు నంటున్నాడు. ఇంత ఆప్యాయంగా, లాలనగా పలుకరిస్తున్నాడు!

''ఆస్పత్రి నుంచి బయటపడి వస్తున్నాను'' అన్నాడు దిగులుగా - ఇంతకంటే ఏం చెప్పాలో తోచక.

''ఎక్కడికి వెళ్లాలి?'' అడిగాడు శీతారాం.

''తెలియదు. అంతా పునఃసృష్టి చేసుకోవాలి. అదే ఆలోచిస్తున్నాను'' అన్నాడు పరాంకుశం.

''సరే పద! మా ఇంటికి వెడదాం'' అన్నాడు శీతారాం. ''తరువాత తీరుబడిగా ఆలోచించుకుందువుగాని!''

ఖాళీగా వస్తున్న ఆటోను కేకేసి దాన్లో ముందు పరాంకుశాన్ని కూలవేసి, తనూ కూర్చున్నాడు శీతారాం. ఇంటికి వెళ్లేంతవరకు పరాంకుశం గురించే ప్రశ్నలు వేస్తూ, చిన్న చిన్న జవాబులు రాబడుతున్నాడు.

ఆటో ఆపి, డ్రైవర్‌కు డబ్బు లిచ్చి పరాంకుశం చేయి పట్టుకుని ఇంట్లోకి అడుగులు వేశాడు. ఎదురుగా గోవిందరావు!

ఆశ్చర్యం! అతడి మెదడులో ఏదో మెదలింది.

''చాలాసేపయిందా వచ్చి? అయాం సారీ! చిన్న పని మీద బయటకు వెళ్లాను. ఆలస్యం అయిపోయింది. ఇంతలో మన పరాంకుశం కనిపించాడు. సర్‌ప్రైజ్ కదూ!'' అన్నాడు

గోవిందరావు పరాంకుశాన్ని పలుకరించాడు.

వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ ఉండగా శీతారాం లోపలకు వెళ్లాడు.

''ఇంతసేపు ఎక్కడికి వెళ్లారండీ!'' అంది ఇంత దీర్ఘం తీస్తూ భార్య.

శీతారాం లోగొంతుకతో - ''ఎంతసేపయింది, మన గోవిందం వచ్చి?'' అనడిగాడు.

ఆమె చెప్పింది.

''మై గాడ్! చంపేశావు పో! సరిగ్గా పదకొండున్నరకే వచ్చేశాడా?''

''ఆహా!''

''అయ్యయ్యో ! ఎంత పని జరిగింది. అతన్ని భోజనానికి రమ్మన్నాను ఈ రోజు. ఆ సంగతే మరిచిపోయి బజారునపడ్డాను'' అన్నాడు శీతారాం నొసలు నొక్కుకుంటూ.

''భోజనానికి రమ్మన్నారా ? నాతో మాట మాత్రం అయినా చెప్పలేదే !''

''చెప్పాలనుకున్నాను, చెప్పలేదా ?'' అని, మరుక్షణంలోనే ''ఎంత అకృత్యం జరిగిపోయింది ? ఇప్పుడేం చేయడం ? పోనీ కాఫీ అన్నా ఇచ్చావా ?'' అనడిగాడు.

''రాగానే ఆపిల్ జ్యూస్ ఇచ్చాను. అంతే!''

''పోనీ నేను రావడం ఆలస్యం అయినా అతనికి భోజనం పెట్టి పంపేయాల్సింది నువ్వు. ఏదో అర్జెంట్ పని మీద వెళ్లిపోయి తిరిగి రాలేకపోయానని సర్దుకోవడానికైనా, వీలుండేది. ఎంత పని చేశావు!''

''మళ్లీ నన్నే అంటారు ! నాకీ సంగతి ముందుగా చెప్పారా మీరు ?''

''నీతో చెప్పకపోవడం పొరపాటే ! అయినా చూశావా, ఇప్పుడేం చేశానో!''

ఏమిటన్నట్లు చూసింది ఆమె.

''మరో అతిథిని తీసుకువచ్చాను. మా ముగ్గురికీ షడ్రసోపేతంగా కాకపోయినా, మామూలు మర్యాదలకు లోపం లేకుండా భోజనం పెట్టేయాలి నువ్వు. ఎంత టైం పడుతుంది ?''

ఆమె విసుక్కోలేదు.

''అయిదు నిముషాలు చాలు, అప్పడాలు, వడియాలు వేయించి పిలుస్తాను. అన్నీ సర్దుకోవచ్చునులెండి ! ఒక్క మనిషేగా ఎక్కువ. నేను తర్వాత ఏదో చేస్తాను. మీరు వెళ్లి వాళ్లతో మాట్లాడుతూ కూర్చోండి. పిలుస్తాను'' అంది.

శీతారాం మళ్లీ ముందు గదిలోకి వెళ్లిపోయాడు.

పరాంకుశం, గోవిందరావు మాట్లాడుకుంటున్నారు.

''వెనకటి పరిసరాలు, వెనుకటి ఉద్యోగం, సంపాదించుకోగలిగితే మరీ మంచిది. అలవాటు అయిన పని. అలవాటు అయిన అలవాట్లు'' అంటున్నాడు పరాంకుశం.

''నీ ఉద్యోగం విషయం ఏమీ బెంగపడకు, మన గోవిందం ఎక్కడో ఒక చోట 'ఫిక్స్' చేస్తాడు'' అన్నాడు శీతారాం.

మళ్లీ తనే ''అయాం సారీ ! మరో అయిదు నిముషాల్లో లేద్దాం!'' అన్నాడు.

''నేను రేడియో స్టేషన్‌కు ఒకమారు ఫోన్ చేయనా ! నాలుగు గంటలకు వస్తానని చెబుతాను వాళ్లకు'' అన్నాడు గోవిందరావు.

''తప్పకుండా !'' అని శీతారాం అతన్ని ఫోన్ ఉన్న పక్కగదిలోకి తీసుకు వెళ్లాడు. ''నా మూలంగానే రొటీన్ అంతా మారిపోయింది ఈ రోజు. క్షమించాలి.''

నవ్వి ఊరుకున్నాడు గోవిందరావు. అతను ఫోన్‌లో మాట్లాడుతూ ఉండగా, శీతారాం మళ్లీ డ్రాయింగ్ రూంలోకి వచ్చాడు. అప్పటికి పరాంకుశం బ్రీఫ్‌కేస్‌లో నుంచి క్రాస్ వర్డ్ పజిల్స్ పుస్తకం ముందుకు తీసుకుని దాన్లో మునిగిపోయాడు.

''ఇంకా నువ్వు ఇది ట్రై చేస్తూనే ఉన్నావా ?'' అన్నాడు శీతారాం.

పరాంకుశం ఏమీ మాట్లాడలేదు. నవ్వి ఊరుకుని తన పనిలో మునిగిపోయాడు.

''వాటి రుచి మరిగితే వదలడం కష్టం. నీకేం తెలుస్తుంది వాటి మజాకా'' అన్నాడు గోవిందరావు.

పరాంకుశం ఈమారు వాళ్లిద్దరినీ చూసి మరింత ఆప్యాయంగా నవ్వాడు. ఈ అలవాటు తనకు కాలేజీ రోజుల్నుంచీ ఉన్నది. గోవిందరావు కూడా తన 'లైన్'లోనే ఉన్నాడన్నమాట !

ఒకటో, రెండో మాటలు దొరక్క గడి ఖాళీగా ఉండిపోయినప్పుడు ఎంత మనస్తాపం కలుగుతుందో బాగా అనుభవం పరాంకుశానికి. ఆలోచిస్తూనే నిద్రలో పడిపోతే తిరిగి తెల్లవారుజామున ఏ మూడున్నరకో, నాలుగు గంటలకో మెలకువ వచ్చి ఆ మిగిలిపోయిన 'క్లూ' మనసులో మెదులుతుంది. వెంటనే ఆ అక్షరం రాసేసి హాయిగా నిద్రపోతే మరునాడు ఉదయం ఎంత ఆలస్యంగా నిద్ర లేస్తే మటుకు ఏం నష్టం !

ఈ లోపల – శీతారాం, గోవిందరావు కబుర్లలో పడ్డారు. వాళ్లు ఒక దారికి రాక ముందే భోజనాలకు పిలుపు వచ్చింది.

''ఆలస్యం అయిపోయినందుకు ఏమీ అనుకోకు, గోవిందరావ్ ! అసలు పరాంకుశంతో కలిసి అతని గదికే వెళ్లిపోయేవాడినేమో – అతను అలాంటి దేం లేదని చెప్పబట్టి ఇప్పటికైనా రాగలిగాను'' అన్నాడు శీతారాం.

ముగ్గురూ నవ్వుకుంటూ లేచారు.

భోజనాలు చేయడం బహు సరదాగా గడిచిపోయింది.

''మీకు చాలా శ్రమ ఇచ్చాను'' అన్నాడు గోవిందరావు చేతులు తుడుచుకుంటూ.

''ఊరికే కూర్చోబెట్టి రెండున్నర గంటలసేపు సస్పెన్స్‌తో నిన్ను ఇబ్బంది పెట్టిన దానికంటేనా?'' అన్నాడు శీతారాం - భార్య ముఖంలోకి చూడటానికి ధైర్యం లేక. ఆమె మాత్రం ఏమీ అనలేదు. భోజనానికి పిలిచిన మనిషి ఆ సంగతి ఇంట్లో చెప్పలేదనే విషయం 'అతిథి' ముందు బయటపడలేదు కదా అని తన ఏర్పాట్లు, వడ్డింపులు అతి నైపుణ్యంతో చేసింది ఆమె. అతనికి తెలిస్తే ఏమనుకుంటాడు ? ఈ సంఘటన మీదనే అవలీలగా ఒక కథ రాసేసి ఇలాంటి వాళ్లందరికీ 'గుణపాఠం'గా ఉండేటట్లు తయారుచేస్తాడేమో అని కూడా ఆమె మనసులో ఆలోచన మెదిలింది. అవును, గోవిందరావు రాసే కథలు అన్నీ ఇలాంటి చమత్కారాలతోనే నిండి ఉంటాయి. అవన్నీ ఎప్పుడో అప్పుడు, ఎక్కడో అక్కడ ఆ జీవితంలో తటస్థపడిన సందర్భాలకు తగు మాత్రం 'కల్పన' జోడు చేసి తయారుచేసినవే అయి ఉంటాయి అనుకుంది ఆమె. ఈలాంటి విషయాలు రచయితలతో 'డిస్కస్' చేస్తే తమాషాగా ఉండే మాట మాత్రం నిజం ! ఈ ఊహ వచ్చినందుకు నవ్వుకుంది ఆమె.

''ఎందుకు నవ్వుతున్నావ్ ? నీ కేమైనా మిగిల్చామా, లేదా ! బాగా ఆలస్యం అయిపోయింది. నువ్వు కూడా కానిచ్చేయ్!'' అంటూ లోపలకు వచ్చాడు శీతారాం.

''మీ ముగ్గురూ తిన్నా ఇంకా ఇద్దరికి సరిపడే పదార్థాలు మిగిలే ఉన్నాయి. ఈ రోజు మన ఇంట్లో అక్షయ పాత్ర ఉదయించిందేమో నని ఆనందిస్తున్నాను. నేను తింటాను గాని, మీరు వెళ్లి మీ స్నేహితులతో కాలక్షేపం చేయండి' అంది ఆమె.

శీతారాంకు ఆమె మాటలు విన్నాక చాలా ఊరట కలిగింది. అంతగా అన్నీ మిగిలి పోవటానికి కారణం ముగ్గురూ మాటల్లో పడిపోయి తిండి విషయమే మరచిపోవడమో, లేక మొహమాటం కొద్దీ బహుకొద్దిగానో తినగలగడమో అయి ఉండాలి కాని అక్షయ పాత్ర మాత్రం కాదని అతనికి తెలుసు.

మూడూ ముప్పావుకల్లా గోవిందరావు సెలవు తీసుకుని వెళ్లిపోయాడు.

పరాంకుశం కాసేపు నిద్రపోయి లేచి కూర్చుని తన ఆలోచనల మూటలు విప్పాడు వెంటనే కొనుక్కోవలసింది అలారం టైంపీస్ !

మరునాడు ఉదయం పాత యజమాని దగ్గరకు తొమ్మిదిగంటలకల్లా వెళ్లాలి. ఆ తరువాత కానీ తను ఏం చేయవలసిందీ నిర్ధారణ కాదు.

కాని పరాంకుశం పదకొండు గంటలకుగాని చేరుకోలేకపోయాడు అక్కడికి. తీరా అంతదూరం వెళ్లిన తర్వాత తెలిసిన ఒక విషయం - ఆ పుస్తకాల తయారీ కంపెనీ ఇక్కడ లేదు. రెండు నెలల క్రితమే ఇంకెక్కడికో మార్చేశారుట !

పరాంకుశం కొత్త 'చిరునామా' అడిగి తీసుకున్నాడు.

ఇంతలో మరో విచిత్రం తటస్థించింది.

లోపలి నుంచి వచ్చిన ఒక ఆసామీ పరాంకుశాన్ని ఎగాదిగా చూసి, ''ఆ కంపెనీతో, మీకు ఏమిటి పని ? ఏం కావాలి ?'' అనడిగాడు, అతి అనుమానంగా చూస్తూ.

పరాంకుశం తన తాపత్రయం అంతా చెప్పుకున్నాడు.

ఆ ఆసామి ''మీకు కావల్సింది ఉద్యోగం. అంతేగదూ!'' అన్నాడు.

పరాంకుశానికి ఈ మాటలు అర్థం కాలేదు. ఎగాదిగా చూస్తూ ఉండిపోయాడు.

''ఇది కూడా పుస్తకాల కంపెనీయే ! మీరు బాగా పనిచేస్తే ఇక్కడే ఉద్యోగం ఇస్తాను'' అన్నాడు ఆ ఆసామి.

అనడమే కాకుండా అప్పుడే ప్రెస్ నుంచి వచ్చిన 'గాలీ ప్రూఫులు' అతని ముందు పడేశాడు - 'ఇవి కరెక్షన్ చేయండి' అని సవాలు చేస్తున్నట్లు అంటూ.

పరాంకుశం చకచకా 'ప్రూఫ్ కరెక్షన్ వర్క్'లో మునిగిపోయాడు. గడియారం పెద్ద ముల్లు తిరిగి వచ్చేటప్పటికి ఒక చుట్టు - కర్రెక్టడ్ ప్రూఫ్‌లు యజమాని ముందు విసిరేసి నిలబడ్డాడు. ఆయన అరగంటసేపు అన్ని పేజీలు తనిఖీ చేసి ''రైట్! బాగుంది. ఇంతకూ మీకు అక్కడే ఉద్యోగం చేయాలని రూలేం లేదుగా ! మా దగ్గర పని చేస్తారా ?'' అనడిగాడు.

పరాంకుశానికి ఉద్యోగం దొరికింది. కాకపోతే జీతం ఎక్కువ కాదు. అయినా సరిపెట్టుకోవటానికి సరిపోతుంది. అయితే నేం - తెలిసిన పని, చేతనయిన పని, అదే అతిముఖ్యం. అతనికి చాలా సంతోషం అయింది. మధ్యాహ్నం వక్కహోటలుకు వెళ్లి భోజనం చేశాడు. శీతారాం కనిపించిన వేళా విశేషం మంచిదే. సాయంత్రం అతనికి థ్యాంక్స్ చెప్పుకోవాలి. మరో కొత్త క్రాస్‌వర్డ్ పజిల్ పుస్తకం కొనుక్కోవాలి.

నెలరోజులు గడిచేసరికి అతనికి కొత్త వాతావరణం అలవాటయి పోయింది. పాత కంపెనీ ఎక్కడుందో, అక్కడి ఉద్యోగం ఏమయిందో కనుక్కుందామన్న ధ్యాస ఏమీ లేదు. ప్రూఫ్ రీడింగ్ నైపుణ్యంగా చేస్తున్నందుకు ప్రతిఫలంగా కొద్దిపాటి ఎడిటింగ్ వర్క్ కూడా ఇస్తున్నారు ఇప్పుడు.

వెంటనే వచ్చి పరీక్ష చేయించుకుని వెళ్లమని ఆస్పత్రి నుంచి కార్డు వచ్చింది. తన కొత్త చిరునామా వాళ్లకు ఇవ్వనే లేదు ఇంకా. అయినా ఎలా పట్టుకున్నారో ఆ కాలాంతకులు అనుకున్నాడు.

ఆస్పత్రికి వెళ్లడం అంటే మనసుకు కాస్త చికాగ్గా ఉన్నమాట నిజమే.

తన జబ్బు పూర్తిగా నయం కాలేదనీ, కాస్తో కూస్తో మిగిలే ఉన్నదనీ సూచించడం కదూ ఈ కార్డు చేస్తున్న పని ?

ఉత్తరం వచ్చిన రెండో రోజే ఆస్పత్రికి వెళ్లాడు – క్రాస్ వర్డ్ పజిల్ పుస్తకంతో సహా, వెయిటింగ్ హాల్‌లో అరగంట కూర్చున్న తర్వాత గాని డాక్టర్‌కు 'ఫ్రీ' కాలేదు.

''కులాసాగా ఉన్నారా ?'' అనడిగాడు డాక్టర్.

'ఈ ప్రశ్నలో వెటకారం గాని లేదు కదా' అని తటపటాయించాడు కాసేపు పరాంకుశం.

డాక్టర్ కూర్చున్న టేబుల్ చక్కగా నిగనిగలాడుతూ ఉంది. ఆయన దాని ముందు నుంచి లేచి వచ్చి పరాంకుశాన్ని సాదరంగా ఆహ్వానిస్తూ, షేక్ హాండ్ చేసి మరీ కుర్చీలో కూర్చోబెట్టాడు.

రోగులతో షేక్ హేండ్ చేయడం ఈ డాక్టర్ ప్రత్యేకత. అది కూడా పరీక్షలో భాగమేనని పరాంకుశం అనుమానం.

''ఉద్యోగం ఎలా ఉంది ?

''ఇల్లు ఎలా ఉంది ?

''రోజులు చక్కగా నడుస్తున్నాయా ?''

ఇలాంటి ప్రశ్నలకు ఉదాసీనంగానే జవాబు ఇచ్చాడు.

ఎంత త్వరగా ఈ గందరగోళం వదిలించుకుని బయటపడగలిగితే అంత మంచిదని అతనికి అనిపిస్తోంది. మళ్లీ ఆస్పత్రికి చిక్కుకుపోతే నేరుగా నరకానికి

వెళ్లినట్లే! తనను ఎలాగైనా ఈ నరకానికి ఈడ్చుకు రావాలని కదూ డాక్టర్ చూస్తున్నది.

''అయితే తీరిక సమయాల్లో ఏం చేస్తున్నారు?''

క్రాస్ వర్డ్ పజిల్ పుస్తకం చూపించాడు పరాంకుశం.

''అన్నీ వస్తున్నాయా, ఏమైనా తికమక పెడుతున్నాయా ?''

''రోజుకు ఒకటయినా తప్పనిసరిగా చేస్తున్నారా ! టచ్ పోకుండా చూసుకోవాలి. ఆఁ, ఇంకా మీ ఇతర అలవాట్లు ఎలా ఉన్నాయి ?''

పరాంకుశం ఏమీ కళవెళపాటు లేకుండా నిలదొక్కుకుని జవాబులు చెబుతున్నాడు.

డాక్టర్ రెండు నిముషాలు మౌనంగా ఉన్నాడు.

ఈ మౌనం పరాంకుశానికి అంకుశంగా తయారయింది. ఏమిటో పథకం వేస్తున్నాడేమో మనసులో, నన్ను ఎలా బోల్తా కొట్టించాలా అని !

''ఇప్పుడు మీకు సుస్తీ ఏం లేదు'' అన్నాడు డాక్టర్. కేస్ షీట్‌లో ఏదో రాసుకుంటున్నాడు.

''ఇక ముందు మేం పిలవం. మీకు అవసరం అనుకుంటే మటుకు రావడానికి సందేహించకండి'' అన్నాడు డాక్టర్ - ''యు ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్ !''

పరాంకుశం ముసిముసిగా నవ్వుకుంటూ ఆ గదిలో నుంచి బయటపడ్డాడు.

నవ్వు మాత్రం చెరక్కుండానే రోడ్డు మీద నడుస్తున్నాడు.

డాక్టర్ అంటే తనకు ఎంత అసహ్యమో నెమరువేసుకుంటున్నాడు. అతనికి తప్పకుండా ఏదో తీవ్రమైన రోగం ఉంటుంది. లేకపోతే పేషంట్ల కళ్లలోకి అలా గుచ్చి గుచ్చి చూడడు - అనుకున్నాడు.

ఇలా అనుకున్న తర్వాత పరాంకుశానికి మనసుకు మరింత హాయి అనిపించింది. తిన్నగా ఇంటికి వెళ్లాడు.

పక్కమీదకు వాలి ఏదో పుస్తకం చదువుకుంటూ ఉండిపోయాడు.

కాసేపు అయ్యాక భోజనం చేయాలి.

ఏడువారాలు ఏమేం తినాలో, పగలు ఏదో, రాత్రి ఏదో, అతనో పట్టిక తయారు చేసి పెట్టుకున్నాడు. నియమానుసారం రోజులు గడిపేయడమే అతనికి ఇష్టం. జీవితం ఎంత హాయిగా, సరళంగా నడవాలనుకున్నాడో అంత కచ్చితంగానూ గడుస్తోంది.

అంతకంటె ఆనందం ఇంకేం ఉంది ?

పరాంకుశం 'ప్రస్తుతం'లో ఇమిడిపోతున్నాడు అని సంతోషించాడు డాక్టర్. వెనుకటి మోస్తరు జీవితమే కావాలనుకోవడంలో వింత ఏమీ లేదు. కొద్దిమంది మటుకే కొత్త మలుపులు కోరుకుంటారు. తిరగగలుగుతారు. జీవితాన్ని తిప్పగలుగుతారు. పరాంకుశం కేసు అతనికి ఎప్పుడూ వింతగానే అనిపించింది. ఈ రోజు అతను చూపించిన క్రాస్ వర్డ్ పజిల్ పుస్తకం మొదటి రోజు ఆస్పత్రిలో చేరినప్పుడు అతని దగ్గర ఉన్నదే ! అందులో పజిల్స్ పూర్తి చేయడం అయిపోయింది. అయినా ఇంకో రంగు పెన్సిల్‌తో రెండోమారు పూర్తి చేస్తున్నాడు. కొత్త వాతావరణంలో ఒద్దికగా ఇమిడిపోతున్నానని చెప్పిన ప్రయత్నమే ఇది ! వెనకటి మాదిరిగా జీవించడం తప్ప ఇంకేం కాదు. జీవితంలోని నలుచదరాలు, ఖాళీలు గుండ్రని అక్షరాలతో నింపే ప్రయత్నం. ఒక 'గడి'లో ఇమిడిపోయేట్లుగా జీవించడం నిజంగా 'అధివాస్తవికం'. సంవత్సరం క్రితం తొడుక్కున్న బూడిదరంగు చొక్కాయే ఇప్పుడు కూడా కష్టపడి సంపాదించి మళ్లీ తొడుక్కుంటున్నాడు పరాంకుశం. అదే భోజనం. అదే నిద్ర, అదే షికారు.

ట్రాఫిక్ లైట్ మారింది. కారు ఆపుకుని వెయిట్ చేస్తున్న డాక్టర్‌కు పరాంకుశం గుర్తు వచ్చాడు. మళ్లీ అతన్ని పరీక్షకు పిలవాల్సిన అవసరం లేదు. వైద్య పరిభాషలో చెప్పుకోవాలంటే కొత్త జీవితానికి అతను అతికినట్లుగా సరిపోయాడు.

సూటిగా వెళ్లి రెండో మలుపు తిరగడం అతనికి అలవాటు. కాని ఈ మారు పరాంకుశం గురించి ఆలోచిస్తూ ఒక మలుపు దాటి వెళ్లిపోయాడు. పక్క వీథిలోకి కారు నడిపి వెనక్కువచ్చాడు. పరాంకుశం ఇలా చెయ్యడు ఎన్నిటికీ - అనుకున్నారు. అలా అనుకోవడంతో అతనికి ఎంతో సంతృప్తి కలిగింది.

• • •

పరాంకుశానికి మటుకు డాక్టర్ గుర్తు రావడం లేదు.

శీతారాం కనిపించి ఆరు నెలలు పైగా అయింది.

గోవిందరావు మాత్రం ఈ సాయంత్రం వస్తానన్నాడు. ఏదో నవల అచ్చువుతున్న

ఫారాలు ఇచ్చాడు పరాంకుశానికి - చూసిపెట్టమని. రెండు రోజులు పోయాక వస్తాను; సీక్వెన్స్ సరిగా ఉందో, లేదో చెక్ చెయ్యమన్నాడు.

పరాంకుశం నవలను ఈ రాత్రే చూశాడు. గోవిందరావుకు ఏం చెప్పాలో కూడా నిర్ధారణ చేసుకున్నాడు.

టైముకు సరిగ్గా వచ్చాడు గోవిందరావు.

''ఇక్కడే కూర్చుందామా లేక, బయటకు ఎటైనా వెడదామా ?'' అని అడిగాడు.

''మీ ఇష్టం !'' అన్నాడు పరాంకుశం.

వేయించిన జీడి పలుకులు నములుతూ ఇద్దరూ అక్కడే కూర్చుండిపోయారు.

''మూడో ఫాం మేటరంతా అయిదో ఫాం తర్వాత రావాలి. అలాగే పదహారో ఫాం మేటర్ పదకొండు తర్వాత, అప్పుడు చదవటానికి ఇంకా బలంగా, పటిష్ఠంగా ఉంటుంది. మీరేం అనుకోనంటే ఆ మార్పులు చేయండి. అంతకంటె దాన్ని గురించి చెప్పవలసింది నాకేం కనబడలేదు'' అన్నాడు పరాంకుశం విషయానికి వచ్చినప్పుడు.

ఒక్కొక్క 'ఫాం' ఒక్కొక్క సందర్భాన్ని ఇముడ్చుకునేట్లుగా చాకచక్యంగా రాశాడు గోవిందరావు. కానీ స్వీక్వెన్స్ విషయంలోనే కొద్దిగా అనుమానం వచ్చి పరాంకుశం సహాయం కోరాడు. మొత్తంలో ఏదో లోపం ఉందని తనకు రూఢిగా తెలిసిన మాట యథార్థమే అయినా అది ఎక్కడ ఉందో గుర్తించటం, అతనికి చేతకాదు. సరిదిద్దటం మాట దేవుడెరుగును. ఈ సంగతంతా పరాంకుశానికి చెప్పడం అవివేకం అనిపించింది. అతనే కనుక్కుంటాడు. పరిష్కారం చెబుతాడు. ముందే అతనికి తన అస్తవ్యస్తపు ఆలోచనలు చెప్పడం ఎందుకు ?

''అలాగే చేస్తాను. లోపల వాక్యాలు ఏమైనా సరిచేయవలసి ఉంటుందా, ఈ మార్పుకు తోడుగా!'' అంటూనే ఇంకా మనసులో ఏమూలో పీకుతున్న అనుమానం బయటపెట్టాడు.

''ఒక్క అక్షరం కూడా కదిలించవలసిన పనిలేదు. నా మాట నమ్మండి. మొత్తం నవల 'నభూతో న భవిష్యతి'గా తయారయింది'' అన్నాడు పరాంకుశం - అతనికి ధైర్యం చెప్పడం కోసం కాస్తో, కాస్తో అతిశయోక్తి ప్రయోగిస్తే మటుకేం అనుకుంటూ.

''చాలా థాంక్స్!''

వెళ్లిపోయే ముందు గోవిందరావు ''మళ్లీ మనం ముగ్గురం కలిసి భోజనం చేయడం ఎప్పటికి కుదురుతుందో!'' అన్నాడు.

పరాంకుశం ''భోజనమా ? తప్పకుండా చేద్దాం !'' అన్నాడు.

''శీతారాంను పట్టుకోవడం కష్టం. అదే వచ్చిన చిక్కు.''

''అవును, నాకు కనిపించే ఆరు నెలలు అవుతోంది'' అన్నాడు పరాంకుశం.

''నేను ఎలాగో పట్టుకుని, ఫిక్స్ చేసి మీకు చెబుతాను'' అన్నాడు గోవిందరావు.

''ఈమారు వాళ్ల ఇంట్లో కాదు. వేరే ఎక్కడైనా మంచి చిన్న హోటల్లో కూర్చుందాం. ఎర్నెస్ట్ హోమింగ్‌వే, అన్నట్లు - 'వెల్ లైటెడ్ ప్లేస్' ఎక్కడన్నా దొరుకుతుందేమో చూడండి. నలుగురమూ హాయిగా రెండు గంటలసేపు కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడానికి, ఒకళ్ల అభిరుచులు మరొకళ్లు స్పష్టంగా అర్థం చేసుకోవటానికి వీలైన మంచి చిన్న హోటల్!'' ఇంకా పరాంకుశం చెప్పడం పూర్తి చేయకుండానే, గోవిందరావు నొసలు ప్రశ్నార్థకంగా మలిచి, ''నలుగురు ఎవరు ?మన ముగ్గురమే కదా!'' అన్నాడు.

పరాంకుశం చిరునవ్వు చిందించాడు.

''చూశారా ! మీరు మరిచిపోయారు. ఊహూఁ మరిచిపోయారని అనడం తప్పు. అసలు మీకు దృష్టిలోనే లేదు ఆ విషయం, ఆ మనిషి ! నిర్లక్ష్యం అనను గాని, అదే మనకు అలవాటైపోయింది'' అన్నాడు పరాంకుశం, నేరుగా అతని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

గోవిందరావు అతని ముఖం వంకే - 'ఇంకా వివరంగా చెప్పండి. లేకపోతే నాకు అర్థం కాదు' అన్నట్లుగా చూస్తూ ఉండిపోయాడు.

'శీతారాంకు భార్య ఉంది. అతను మనలాగా ఒంటరివాడు కాదు గదా!' అన్నాడు పరాంకుశం - చిక్కుప్రశ్న విడదీస్తున్నట్లు, క్రాస్ వర్డ్ పజిల్‌లో ఎంతో తేలికగా ఉండి, సమయానికి మనసుకు తట్టని మాటను స్పష్టపరుస్తున్నట్లూ !

''అవును సుమండీ ! ఆమెను గురించి మరిచేపోయాను. ఎంతో మంచి మనిషి. క్షణాల మీద చాకచక్యంగా ఆరోజు మనందరికీ వండి వడ్డించింది'' అన్నాడు గోవిందరావు - మనసులో నొచ్చుకుంటూ, బయటకు ఎన్ని శ్లాఘ్య వాక్యాలు చెప్పినా తనవి

తీరదు అన్న భావం ముఖంలో స్పష్టపరుస్తూ.

పరాంకుశం మళ్లీ తాత్త్వికంగా ఆలోచించడం, వివరించడం ప్రారంభించాడు.

''చూడండి! జీవితం, దాన్ని పంచుకునే మనుషులూ ఎంతవైవిధ్యంగా ఉంటారో! జీవన సరళిలో, విధానంలో ఒకళ్లకు ఒకళ్లు అమరరు అనుకుంటాం వాళ్లను విడివిడిగా చూసినప్పుడు. కాని ఒకచోట చేరినప్పుడు మాత్రం అన్ని గడులూ సలక్షణంగా నిండిపోయి, నూటికి నూరు మార్కులూ సంపాదించుకున్న విద్యార్థిలాగ విజయ గర్వంతో ఒకటైపోతారు. జీవితంలో ఉన్నది ఏకతే - మరేమీ కాదు''

గోవిందరావు అతని మాటలను శ్రద్ధగా ఆకళింపు చేసుకున్నాడు. పరాంకుశం ఇంకా చెబుతూనే ఉన్నాడు.

''ఎవరి యథార్థ జగత్తు వారిది. కాని అన్ని యథార్థతలు కలిసిపోతాయి - సమయం, సందర్భం సమకూడినప్పుడు. మీరు చూడండి - మేధావంతులు, జీవితాన్ని కల్పనలను కలంలో రంగరించి ప్రజల ముందు ఉంచుతున్నారు. శీతారాం అలా కాదు. అతనికి కల్పనలు చేతకావు. అసలు సిసలైన బిజినెస్ ఎగ్జిక్యూటివ్ కదూ! అతని కేం కావాలో అతనికి బాగా తెలుసు. ఇక నేను ఉన్నానంటే, జీవితం లేదు నాకు, కేవలం కల్పనలే. మనం ముగ్గురం ఇలా విడి విడి మనుషులం అయిపోయినా, మనందరికీ తప్పకుండా కావలసింది వేళపట్టున భోజనం!''

''అవునవును, ఏ పాటు తప్పినా సాపాటు తప్పదని సామెత కూడా ఉంది కదూ!''

''ఆ భోజన సదుపాయాన్ని అడగనక్కర్లేకుండా - అన్నీ అమర్చి ఆ రోజున ఆ ఇల్లాలు మనను ఎలా ఆదరించిందో చూశారా ! చెప్పా పెట్టకుండా ఇంటి మీదికి అతిథుల్ని, అభ్యాగతుల్ని తీసుకువస్తే, చీపురు కట్ట తిరగవేసే ఇల్లాళ్లూ ఉన్నారు. వాళ్లను గుర్తుంచుకున్నంత సాఫీగా శీతారాం భార్యలాంటి వాళ్లను మనం గమనంలోకి తీసుకోం, సహజం కదూ!'' అన్నాడు పరాంకుశం.

గోవిందరావు చాలా ఆశ్చర్యపోయాడు. ఇటువంటి ఆలోచనలు ముందుగా తనకే ఎందుకు కలగలేదా అని !

''అందుచేత ఆమెను శ్రమపెట్టవద్దు మనం. హోటల్లో ఏర్పాటు చేస్తున్నా

నన్నప్పుడు శీతారాం కాదు, కూడదంటాడు. మా ఇంట్లోనే పసందుగా ఉంటుందని వాదిస్తాడు. మీరు అంగీకరించకండి. ఆమెను ప్రత్యేకంగా మరీ ఆహ్వానించండి. మన మేదో బదులు తీర్చుకుంటున్నామనో, మొక్కుబడి చెల్లిస్తున్నామనో కాదు. ఆమెకూ కొన్ని గంటలయినా ఎలాంటి బాదరబాందీ, ఎంబరాస్‌మెంట్ లేకుండా ఉండటం చాలా అవసరం. ఇలాంటి సందర్భాలు ఎంత తరచుగా తటస్థిస్తే అంతగా మానసి కోల్లాసానికి, పునర్వికాసానికి దోహదం అవుతాయి.''

పరాంకుశం ఇంక చెప్పవలసిందేమీ లేదన్నట్లు ఆపేశాడు.

గోవిందరావుకు అప్పుడు అర్థం అయింది క్రాస్ వర్డ్ పజిల్స్‌లో విధిగా నల్ల గళ్లు ఎందుకు అడ్డం రావాలో.

''అలాగే అన్ని ఏర్పాట్లు చేస్తాను. ఈ నెలలోనే ఇది సానుకూలం అయ్యేటట్లు చూస్తాను. అంతవరకు సెలవు'' అంటూ గోవిందరావు ముందుకు నడిచాడు, తన నవల ప్రెస్ ఫారాలు జాగ్రత్తగా చేతులోకి తీసుకుని.

✦